క్లుప్తంగా

జనారణ్యంలోకి జింక


తాటిచెట్లపాలెంలో సంచరిస్తున్న జింక

కొమ్మాది: ఎండ వేడిమిని తట్టుకోలేక దాహం, ఆకలితో జింకలు అభయారణ్యం నుంచి జనారణ్యంలోకి వస్తున్నాయి. కొంతకాలంగా వరుసగా జింకలు నివాసాల్లోకి వస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం జీవీఎంసీ 8వ వార్డు సాగర్‌నగర్ దరి తాటిచెట్లపాలెం వద్దకు కంబాలకొండ నుంచి ఓ జింక తప్పిపోయి వచ్చింది. ఆ జింకపై కొన్ని కుక్కలు దాడి చేసే ప్రయత్నం చేస్తుండగా, స్థానికులు చూసి జింకను రక్షించి, అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు.

పదార్థ విజ్ఞాన శాస్త్ర అన్వేషణలో ఏఐ కీలకం


పరిశోధకుడు అభిషేక్ అగర్వాల్‌ను సత్కరిస్తున్న ప్రొఫెసర్లు

కొమ్మాది: వివిధ రంగాలకు అవసరమైన నూతన పదార్థ విజ్ఞానాన్ని శోధించడంలో కృత్రిమ మేధ కీలక పాత్ర వహిస్తుందని కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయం పరిశోధకుడు అభిషేక్ అగర్వాల్ అన్నారు. గీతంలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో పాల్గొని ఆయన ప్రసంగించారు. పదార్థ విజ్ఞానంపై జగిగే పరిశోధనల్లో సత్వర ఫలితాలకు సంప్రదాయ పద్ధతుల కంటే కృత్రిమ మేధ అత్యంత వేగవంతమైన సమాచారం అందించగలదన్నారు. వైద్య, పారిశ్రామిక, వైమానిక, ఆటోమొబైల్ రంగాల్లో నూతన పదార్థాలను వెలుగులోకి తేవడం ఎంతో అవసరమని, ఈ దృష్ట్యా కృత్రిమ మేధ సహాయంతో మెటీరియల్ సైన్స్ పరిశోధకులు అధ్యయనాలు చేస్తున్నారని వివరించారు. అనంతరం గీతం ప్రొఫెసర్లు ఆయనను సత్కరించారు.

నేడు మద్దిలో సత్తెమ్మ ఉత్సవం


ప్రత్యేక అలంకరణలో సత్తెమ్మ వారు


పద్మనాభం: మండలంలోని మద్దిలో కంటుబోతు వారి ఇలవేల్పు సత్తెమ్మ ఉత్సవం నిర్వహించనున్నట్టు ఎంపీపీ కంటుబోతు రాంబాబు తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారి సన్నిధిలో ఉదయం ఐదు గంటల నుంచే పూజాది కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

నేలపైనే విద్యుత్ వైర్లు


వాంబేకాలనీకి వెళ్లే దారిలో నేలపైనే ఉన్న విద్యుత్ వైర్లు

మధురవాడ: జీవీఎంసీ 7వ వార్డు వాంబే కాలనీ రోడ్డులో శ్రీ కృష్ణ గ్రామర్ స్కూల్ పక్కన ఒక విద్యుత్ స్తంభం నుంచి మరో స్తంభానికి వెళ్లే వైర్లు నేలపై పడి ఉన్నాయి. ఒక వైపు ప్రైవేట్ పాఠశాల, సమీపంలో నివాసాలు ఉన్నాయి. సుమారు 5వేల మంది నివాసం ఉండే వాంబేకాలనీకి వెళ్లే ప్రధాన రోడ్డును ఆనుకుని ఇలా నిర్లక్ష్యంగా వదిలేశారు. పొరపాటున విద్యుత్ ప్రవహిస్తే పెను ప్రమాదం సంభవించే అవకాశం ఉంది. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

'స్టాంప్ డ్యూటీ నిధులు విడుదల చేయాలి'


ఆనందపురం సర్పంచ్ లక్ష్మి

తగరపువలస: గ్రామ పంచాయతీల అభివృద్ధికి స్టాంప్ డ్యూటీ నిధులు విడుదల చేయాలని ఆనందపురం గ్రామ సర్పంచ్ చందక లక్ష్మి కోరారు. ఇటీవల స్టాంప్ డ్యూటీ నిధులు విడుదల చేయకపోవడంతో అభివృద్ధి విషయం పక్కన పెడితే కార్మికులకు వేతనాలు కూడా ఇవ్వలేకపోతున్నామని తెలిపారు. కూటమి ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేయాలని తనతో పాటు పలువురు సర్పంచ్‌లు కోరుతున్నారన్నారు. గ్రామాలలో పేరుకుపోయిన సమస్యలు పరిష్కరించడానికి , అభివృద్ధి పనులు చేయడానికి ఈ నిధులు అవసరమన్నారు. దీనిపై సీఎం చంద్రబాబు, మంత్రి పవన్ స్పందించాలన్నారు.

ఈ సారైనా..

వేలంపాటలో వెళ్లేనా?

చంద్రంపాలెం ఆదిత్యనగర్‌లోని ద్రోణంరాజు కల్యాణ మండపం, మారికవలస రాజీవ్ గృహకల్ప కల్యాణ మండపాలను వేలంలో ఎవరూ పాడుకోకపోవడంతో సుమారు తొమ్మిదేళ్లుగా నిరుపయోగంగా ఉన్నాయి. మార్కెట్ ధరలతో సంబంధం లేకుండా ఇస్తున్న నివేదికలతో కల్యాణ మండపాల వేలంధరలు విపరీతంగా పెంచేయడంతో పాటదారులెవరూ ముందుకు రావడం లేదు. ఈ నెల 29న ఈ కల్యాణమండపాలకు వేలం నిర్వహిస్తున్న నేపథ్యంలో ఈ సారైనా కల్యాణ మండపాలకు మోక్షం దక్కుతుందా అని స్థానికులు ఎదురుచూస్తున్నారు.



ఆక్షన్‌లో వెళ్లని ద్రోణంరాజు కల్యాణ మండపం

- 2016 నుంచి నిరుపయోగంగా జీవీఎంసీ కల్యాణ మండపాలు
- మార్కెట్ రేట్లకు మించిన ధరలతో పాడుకోని కాంట్రాక్టర్లు
- 29న వేలం

మధురవాడ: అంగట్లో అన్నీ ఉన్నా.. అల్లుని నోట్లో శని అన్న చందంగా ఉంది మధురవాడలోని జీవీఎంసీ కల్యాణ మండపాల పరిస్థితి. రోడ్డును ఆనుకుని సువిశాలమైన ప్రదేశంలో ఉన్నా.. కనీస సౌకర్యాలు, నిర్వహణ లేక పాడుబడిన భవనాల్లా మారాయి. జీవీఎంసీ అధికారులు వాస్తవాలకు దూరంగా చేస్తున్న నిర్ణయాలతో పాటదారులెవరూ ముందుకు రాకపోవడంతో ప్రభుత్వ ఆదాయానికి లక్షల్లో గండి పడుతోంది. మరోవైపు కల్యాణమండపాల అద్దెలు సామాన్యులకు అందుబాటులో లేక రోడ్డు మీదనే టెంట్లు వేసుకుని కార్యక్రమాలు చేసుకోవాల్సి వస్తోంది.

ఇదీ పరిస్థితి

జీవీఎంసీలో స్థిర ఆస్తులకు 3 ఏళ్లు, చర ఆస్తులకు 1 ఏడాది పాటు ప్రభుత్వం గెజిట్ ద్వారా వేలం వేసి నిర్వహణ, అద్దెకు ఇచ్చుకునేందుకు లేదా ఫలసాయం అనుభవించేందుకు కేటాయిస్తుంది. అయితే మార్కెట్ ధరలతో సంబంధం లేకుండా జీవీఎంసీ అధికారులు ఇస్తున్న నివేదికలతో జీవీఎంసీ కల్యాణ మండపాల వేలం ధరలు విపరీతంగా పెంచేశారు. రాజీవ్ గృహకల్ప కల్యాణ మండపం రెండు ఫ్లోర్లు రూ.1.12కోట్లు, ద్రోణంరాజు కల్యాణ మండపం రూ. 98లక్షల వరకు పెంచేశారు. పైగా డిమాండ్ కూడా **ఆశించిన** స్థాయిలో లేకపోవడంతో అంత **ధర పెట్టి** పాడుకుంటే గిట్టుబాటు కాదనే **ఉద్దేశం**తో ఈ రెండు కల్యాణ మండపాల**తో** పాటు మరికొన్ని ఆస్తులను వేలంలో పాడుకునేందుకు 2016 సంవత్సరం నుంచి ఎవరూ ముందుకు రావడం లేదు. దీంతో ప్రభుత్వం ఆదాయానికి గండి పడుతోంది. తర్వాత **అధికారులు ప్రొసీజర్ ప్రకారం మూడు సార్లు వేలం వేసి, చేతులు దులిపేసుకుంటున్నారు. ఈ** తతంగం సుమారు తొమ్మిదేళ్లుగా సాగుతున్నా.. ఉన్నతాధికారులు కూడా వీటిపై దృష్టి సారించడం లేదు.

వేలం ధరలు తగ్గిస్తే మేలు

- జీవీఎంసీ తాజా పాలకవర్గం అధికారం చేపట్టిన తర్వాత 56వ నంబర్ జీవోలో లోపాలను దృష్టిలో ఉంచుకుని వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా చర్యలు చేపట్టడానికి 2021లో స్పెషల్ కమిటీ ఏర్పాటు చేసింది. అందులో వాస్తవ పరిస్థితులుకు అనుగుణంగా ఉన్నవి అమలు చేయాలి.
- జీవీఎంసీ కల్యాణ మండపాలకు పదేళ్లుగా కనీస నిర్వహణ, మరమ్మతులు లేవు. ప్రైవేట్ ఫంక్షన్ హాళ్లతో పోటీగా నిలబడే పరిస్థితులు లేవు. ఇప్పుడైనా జీవీఎంసీ కనీస మరమ్మతులు, నిర్వహణ చేపట్టాలి. డిమాండ్, మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా పాటధరలు నిర్ణయించాలి.
- జీవీఎంసీ చెత్త తరలించే క్లాప్ వాహనాలు కల్యాణ మండపాల్లోనే పార్క్ చేసి ఉంచుతున్నారు. వాటిని వెంటనే వేరే ప్రాంతాలకు తరలించాలి.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. జీవీఎంసీ ఆస్తుల వేలాన్ని ఈ నెల 29న మధురవాడ జోనల్ ఆఫీసులో నిర్వహిస్తున్నాం. మా పరిధి మేరకు వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకోవడానికి ప్రయత్నం చేస్తాం, పాటదారులు వస్తే ఏమైనా చెయ్యగలం. అంతా సకాలంలో రావాలి.

– కె.కనక మహాలక్ష్మి, జోనల్ కమిషనర్, జీవీఎంసీ జోన్–2



వేలంపాటలో పాడుకోని మారికవలస కల్యాణ మండపం

ప్రజలకు అండగా సీపీఎం


సంగివలసలో సమస్యలు తెలుసుకుంటున్న సీపీఎం నాయకులు

తగరపువలస: సమస్యలు ఎదుర్కొంటున్న ప్రజలకు సీపీఎం అండగా ఉంటుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి గంగునాయుడు అన్నారు. జీవీఎంసీ 1,2 వార్డుల్లో బుధవారం సీపీఎం నిర్వహించిన ప్రజా చైతన్యయాత్రలో పార్టీ నాయకులు ప్రజల నుంచి సమస్యలు తెలుసుకుని, నోట్ చేసుకున్నారు. బాలాజీనగర్, యాతపేట, సంగివలస గ్రామాలలో నిర్వహించిన కార్యక్రమంలో స్థానికులు తాగునీటి సమస్య, ఉచిత వంటగ్యాస్ రాయితీ బ్యాంకు ఖాతాలలో నమోదు కాకపోవడం, ఇళ్లపై హెచ్‌టీ విద్యుత్ వైర్లు, రహదారులకు మరమ్మతులు వంటి సమస్యలు తెలియజేశారు. కొందరికి ఆనందపురం మండలం జగన్నాధపురంలో జగనన్న కాలనీలలో ఇళ్లు రాగా మరికొందరు తమకు ఇళ్లు మంజూరు కాలేదని తెలిపారు. గంగునాయుడు మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో జోన్ కార్యదర్శి ఆర్‌ఎస్‌ఎన్ మూర్తి, నాయకులు ఎస్.అప్పలనాయుడు, రవ్వ నరసింగరావు, పంపాన సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పార్లమెంట్‌లో ప్రస్తావించాలి

తగరపువలస: పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలు పార్లమెంట్‌లో ప్రస్తావించాలని చిట్టివలస ప్రాంత ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ పెన్షనర్ల సంఘం డిమాండ్ చేసింది. చిట్టివలసలో బుధవారం సమావేశమైన సంఘం నాయకులు మాట్లాడుతూ కనీస పెన్షన్ రూ.1000 కూడా పొందని ఈపీఎఫ్–95 పెన్షనర్లు దేశంలో 37 లక్షల మంది ఉన్నారన్నారు. వృద్ధాప్యంలో భార్యాభర్తలు జీవించడానికి పెన్షన్ అనేది ప్రధాన హక్కు అన్నారు. 2014 ఎన్నికల సమయంలో బీజేపీ అధికారంలోకి వస్తే కనీస పెన్షన్ రూ.3వేలు ఇస్తామని హామీ ఇచ్చిందని, పదేళ్లు గడిచినా పెన్షన్ పెంపు కోసం కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. ఈ పదేళ్లలో ప్రధానికి, కేంద్ర కార్మికశాఖ మంత్రికి, ఈపీఎఫ్‌వో అధికారులకు పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చామన్నారు. అయినా పెన్షనర్లకు న్యాయం జరగలేదన్నారు. పెన్షనర్ల సమస్యలు పరిష్కారం కావాలంటే పార్లమెంట్‌లో చర్చించాలన్నారు. సమావేశంలో సంఘం నాయకులు కానూరి రాంబాబు, దామోదర బాబాజీ, మోర అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేపై రైతులు అపోహలు వీడాలి

ఆర్డీవో సంగీత్ మాథూర్


గిడిజాల గ్రామసభలో మాట్లాడుతున్న ఆర్డీవో సంగీత్ మాథూర్

తగరపువలస: రీ సర్వేపై రైతులు అపోహలు వీడి, రెవెన్యూ సిబ్బందికి సహకరించాలని భీమిలి ఆర్డీవో సంగీత్ మాథూర్ కోరారు. ఆనందపురం మండలం గిడిజాలలో బుధవారం నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. రైతులు నిర్భయంగా తమ భూముల హద్దులు చూపించి సర్వే చేయించుకోవాలన్నారు. రైతులు ఎవరికీ భయపడవద్దని, స్వేచ్ఛగా వ్యవహరించాలని సూచించారు. సర్పంచ్ షిణగం అప్పలరాజు మాట్లాడుతూ తాతలు, తండ్రులు విక్రయించిన భూముల తాలూకా ఎస్‌ఎఫ్‌ఏ వంటి పత్రాలతో వారసులు గందరగోళం సృష్టిస్తున్నారన్నారు. ఇలాంటి వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ పి.శ్యాంప్రసాద్, డీటీవో కొండలరావు, డిప్యూటీ తహసీల్దార్ గోవింద్, సర్వేయర్ అప్పన్న, వీఆర్వో దేవరాజ్, మాజీ సర్పంచ్ కోరాడ రాము తదితరులు పాల్గొన్నారు.

- ఆనందపురం మండలం కుసులవాడ, భీమిలి మండలంలోని తాళ్లవలస, తాటితూరు పంచాయతీలలో రీ సర్వేకు సంబంధించిన గ్రామ సభలు జరిగాయి. కార్యక్రమంలో తహసీల్దార్ పి.రామారావు, షిణగం దామోదరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంగ్లిష్ మీడియం కోసం ప్రత్యేక డ్రైవ్


ర్యాలీ నిర్వహిస్తున్న లక్ష్మీపురం ప్రాథమిక పాఠశాల విద్యార్థులు

తగరపువలస: భీమిలి మండలం లక్ష్మీపురం ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు బుధవారం పంచాయతీలో ర్యాలీ నిర్వహించారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఇంగ్లిష్ మీడియం మోడల్ ప్రైమరీ పాఠశాలగా మార్పు చేయనున్న నేపథ్యంలో చేపట్టిన ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా ఈ ర్యాలీ చేపట్టారు. ఐదేళ్లు నిండిన చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులను కోరుతూ పాఠశాలలో నాడు–నేడు పథకం ద్వారా కల్పించిన వసతుల గురించి వివరించారు. ఈ ర్యాలీలో భీమిలి వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, ఎంఈవో జి.శివరాణి, ప్రధానోపాధ్యాయిని ఇందుమతి, సీఆర్పీ సూర్యనారాయణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు

- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్న ప్రజలు


వేములవలసలో విద్యుత్ స్తంభం చుట్టూ చేపడుతున్న నిర్మాణం

తగరపువలస: ఆనందపురం మండలం వేములవలస కూడలిలోని పాత సినిమాహాలు మార్గంలో అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నా రెవెన్యూ, పంచాయతీ అధికారులు చోద్యం చూస్తున్నారు. పదేళ్ల క్రితం అనకాపల్లి–ఆనందపురం జాతీయ రహదారి విస్తరణ సమయంలో వేములవలస వద్ద రహదారిని ఆనుకుని సొంత స్థలాలు ఉన్నవారికి అప్పట్లో నేషనల్ హైవే నష్టపరిహారం ఇచ్చి స్థలాలు స్వాధీనం చేసుకుంది. తరువాత జరిగిన పరిణామాల కారణంగా జాతీయరహదారి నిర్మాణ మార్గం మారింది. అప్పట్లో నేషనల్ హైవే స్వాధీనం చేసుకున్న స్థలం ఖాళీగా ఉండటంతో, నష్టపరిహారం తీసుకున్నవారే ప్రస్తుతం శాశ్వత నిర్మాణాలు చేపడుతున్నారు. ఇప్పటికే నాలుగైదు నిర్మాణాలు జరిగిపోవడంతో స్థానికులు వేములవలస పంచాయతీ కార్యాలయంతో పాటు ఆనందపురం రెవెన్యూ అధికారులు గ్రామ సచివాలయానికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ వీరికి చీమ కుట్టినట్టయినా లేకపోవడంతో నిర్మాణాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. దీనివలన వెనుక ఉంటున్నవారు ఇబ్బందులకు గురవుతున్నారు. గతంలో చిరు వ్యాపారాలు, బోర్డులు మాత్రమే ఉండేవని ఇప్పుడు విద్యుత్ స్తంభాలను ఆక్రమించి నిర్మాణాలు జరుగుతున్నా ఎవరూ పట్టించుకోకపోవడంతో ఆక్రమణదారులతో అధికారులు కుమ్మక్కయ్యారని వేములవలస ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్టు వారు తెలిపారు.


సంరక్షణ లేక నిర్జీవంగా..


ఎండిపోతున్న కొబ్బరి చెట్లు


నేలకొరిగిన కొబ్బరి చెట్టు

కొమ్మాది: విశాఖ–భీమిలి బీచ్ రోడ్డు సుందరీకరణలో భాగంగా గత ప్రభుత్వం భీమిలి, ఇస్కాన్ టెంపుల్ సమీపంలో, సాగర్‌నగర్ తీరాల వద్ద కొబ్బరి చెట్లతో (కోకో ఎరీనా) పార్కులను ఏర్పాటు చేశారు. వీటిపై పర్యాటకులు ఆనందం వ్యక్తం చేశారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత కొత్త పార్కులను ఏర్పాటు చేయడం దేవుడెరుగు, ప్రస్తుతం ఉన్న ఈ పార్కులను సంరక్షించలేక పోతోంది. దీంతో ఈ పార్కుల్లో ఏర్పాటు చేసిన కొబ్బరి చెట్లు నీరు లేక, సంరక్షణ లేక నిర్జీవంగా తయారవుతున్నాయి. కొన్ని బలాన్ని కోల్పోయి నేలకొరుగుతున్నాయి. సంబంధిత అధికారులు వీటిపై ప్రత్యేక దృష్టి పెట్టి పూర్వ వైభవం తీసుకురావాలని పర్యాటకులు కోరుతున్నారు.

మినీ వ్యాన్ డ్రైవర్ల ఆందోళన


మద్దిలో నిరసన వ్యక్తం చేస్తున్న మినీ వ్యాన్‌ల డ్రైవర్లు, కార్మికులు

పద్మనాభం: మినీ వ్యాన్‌ల ట్రాన్స్‌పోర్టు డ్రైవర్లు, కార్మికుల వేతనాలు పెంచాలని సీఐటీయూ భీమునిపట్నం జోన్ కార్యదర్శి ఆర్.ఎస్.ఎన్.మూర్తి డిమాండ్ చేశారు. తమకు వేతనాలు పెంచాలని మినీ వ్యాన్‌ల ట్రాన్స్‌పోర్టు డ్రైవర్లు, కార్మికులు, బుధవారం నుంచి చేపట్టిన సమ్మెలో భాగంగా మద్దిలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మూర్తి మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మినీ వ్యాన్‌ల ట్రాన్స్‌పోర్టు డ్రైవర్లు, కార్మికులకు వేతనాలు ఇవ్వాలన్నారు. చాలీచాలని వేతనాలతో కార్మికులు, డ్రైవర్లు కుటుంబాలను పోషించుకోడానికి ఇబ్బంది పడుతున్నారన్నారు. దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. సీఐటీయూ నాయకుడు ఎస్.అప్పలనాయుడు మాట్లాడుతూ కార్మికుల కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్ ఉన్నా ప్రభుత్వం, కార్మిక శాఖ అధికారుల పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మినీ వ్యాన్‌ల డ్రైవర్ల సంఘం అధ్యక్షుడు ఆర్.సురేష్, కార్యదర్శి వి.నాగరాజు, కోశాధికారి ఎం.సురేష్ పాల్గొన్నారు.



విద్యార్థులకు నేలబారు చదువులు తప్పడం లేదు. ఏడో వార్డు వాంబేకాలనీ పరిధి సునీల్‌శర్మ కాలనీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు నేలపైనే కూర్చుని చదువుకుంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో నాడు-నేడు కింద ఈ పాఠశాలలో 6 అదనపు తరగతి గదుల నిర్మాణం, ఇతర అభివృద్ధి పనుల నిమిత్తం 2024-25 విద్యా సంవత్సరంలో సుమారు రు.1.82కోట్లు నిధులు మంజూరయ్యాయి. రూ. 1కోటి వరకు మాత్రమే పనులు జరగగా, మిగిలిన నిధులు ప్రభుత్వం మారిన కారణంగా ఆగిపోయాయి. దీంతో అసంపూర్తి భవనంలో ఇలా నేలపై కూర్చుని విద్యనభ్యసించాల్సిన పరిస్థితి ఏర్పడింది. - మధురవాడ

నిలువ నీడ లేక.. భద్రత కరువై..

- రెయిలింగ్‌పై కూర్చుని విద్యార్థుల నిరీక్షణ
- బస్సుల కోసం పరుగులు
- షెల్టర్లు లేక అవస్థలు


జాతీయరహదారి వైపు వేచి ఉన్న విద్యార్థులు

తగరపువలస: విద్యార్థులు ప్రమాదకరమైన పరిస్థితులలో బస్సుల కోసం వేచి ఉంటున్నారు. సంగివలస జాతీయ రహదారితో పాటు ఇరువైపులా ఉన్న సర్వీస్‌రోడ్ల వద్ద ఈ పరిస్థితి నెలకొంటోంది. ఇక్కడ బస్ షెల్టర్లు లేకపోవడంతో రోజూ సాయంత్రం వేళ విశాఖ, విజయనగరం వైపు వెళ్లే విద్యార్థులు జాతీయ రహదారికి ఆనుకుని వేసిన రెయిలింగ్‌పై కూర్చుని కబుర్లు చెప్పుకోవడం, ఫోన్లు చూసుకోవడం చేస్తున్నారు. మరికొందరు ఇరుకుగా ఉండే సర్వీస్ రోడ్లపైనే వేచి ఉంటున్నారు. తమను గమ్యం చేర్చాల్సిన బస్సులు వస్తున్నాయని తెలిసిన తరువాత సడెన్‌గా బస్సుల వైపు పరుగులు తీస్తున్నారు. బస్సు డ్రైవర్ అకస్మాత్తుగా బ్రేకులు వేయడమో, లేదా ఆపకపోవడమో నిత్యం ఇక్కడ జరుగుతుంది.

కానరాని హెచ్చరిక బోర్డులు

ఈ ప్రాంతం ఇరువైపులా నిత్యం ఎన్ఆర్ఐ ఆస్పత్రికి వచ్చే రోగులు, ముగ్గురు అమ్మవార్ల ఆలయాలకు వచ్చే భక్తులతో రద్దీగా ఉంటుంది. దీనికి తోడు ఉదయం బస్సులలో వచ్చే విద్యార్థులు, సాయంత్రం ఇళ్లకు వెళ్లే సమయంలో మరింత రద్దీగా మారుతుంది. హైవేపై స్టాపర్లు తప్ప సర్వీస్‌రోడ్డుపై ఎలాంటి హెచ్చరికలు లేవు. గతంలో అనిట్స్ యాజమాన్యం నిర్మించిన బస్ షెల్టర్‌లో విద్యార్థులు తలదాచుకునేవారు. ఇప్పుడు ఎలాంటి షెల్టర్లు లేకపోవడంతో జాతీయరహదారి, సర్వీస్ రోడ్డుపైనే బస్సుల కోసం ఎదురు చూస్తున్నారు. ఒక్కోసారి జాతీయరహదారిపై వేగంగా వెళ్లే వాహనాలు అదుపు తప్పి సర్వీస్‌రోడ్డు పైకి వస్తున్నాయి.

తరచూ ప్రమాదాలు

తగరపువలసలో ఆర్టీసీ కాంప్లెక్స్ లేని కారణంగా బస్సులు బంగ్లామెట్ట, అంబేడ్కర్ కూడలి, వెంకటేశ్వర మెట్టకు ఇరువైపులా జాతీయరహదారి, సంగివలసకు ఇరువైపులా జాతీయ రహదారి, సంగివలస, వెంకటేశ్వరమెట్ట, ఈఎస్ఐ వద్ద సర్వీస్‌రోడ్లలో ఒక్కో బస్సును ఒక్కోచోట ప్రయాణికుల కోసం ఆపుతూ అయోమయానికి గురి చేస్తున్నారు. దీంతో ఎక్కువగా విద్యార్థులే ప్రమాదాలకు గురవుతున్నారు. ఎంపిక చేసిన ప్రాంతాలలో షెల్టర్లు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. హెచ్చరికలతో పాటు బస్సులు నిలిచే సూచీ బోర్డులు ఉంచాలని.. ప్రమాదాల నివారణకు ఆర్టీసీ, భీమిలి పోలీసులు సంయుక్తంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.


బస్సు కోసం ఎదురుగా పరుగులు తీస్తున్న విద్యార్థులు

అందినంత ఎత్తులో ప్రమాదం


తెరచి ఉన్న విద్యుత్ బాక్సు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు సాగర్‌నగర్ సచివాలయం 1, 2లో అధికారుల నిర్లక్ష్యం ప్రమాదానికి దారితీసే విధంగా ఉంటోంది. ఇక్కడ రెండు సచివాలయాలతో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉంది. నిత్యం వందలాది మంది ప్రజలు తమ అవసరాల కోసం వస్తుంటారు. అయితే ఆస్పత్రిని ఆనుకుని ఓ విద్యుత్ బాక్సు రోజుల తరబడి తెరిచే ఉంచేశారని, ఇది అందరికీ అందేంత ఎత్తులో ఉండటంతో ప్రమాదం పొంచి ఉందని ఇక్కడి వారు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.